క్లుప్తంగా

సబ్ మార్కెట్‌యార్డుకు స్థల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ శివారులో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం కోసం బుధవారం పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ స్థలాన్ని పరిశీలించారు. కొమలంచ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ స్థలం సబ్‌మార్కెట్ యార్డు నిర్మాణానికి అనువుగా ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు మార్కెట్ చైర్మన్ మనోజ్ పటేల్ సూచించారు. మహమ్మద్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నాగభూషణంగౌడ్, కాలిక్, నారాయణ, కిష్టాగౌడ్, తహసీల్దార్ సవాయిసింగ్, సర్వేయర్ శ్రీకాంత్ ఉన్నారు.

ఆర్గొండలో శనగ పంట..

రాజంపేట: ఆర్గొండ గ్రామంలో శనగ పంటను బుధవారం మండల వ్యవసాయ అధికారి శృతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాసంగి శనగ పంటలో పూతనాయ దశలో ఆశించే శనగ పచ్చ పురుగు నివారకు తొలిదశలో వేప నూనె 5 ఎంఎల్/లీటర్ నీటికి, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు స్పైనోశాడ్ లేదా క్లొరాంత్రినిలిప్రోల్ మందులు 0.3 ఎంఎల్/లీటర్ నీటికి అంటే 60 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయడం ద్వారా ఈ పురుగు ఉధృతిని తగ్గించవచ్చని వివరించారు. ఏఈవో బాలకిషన్ రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌లో అంతర పంటలు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట శివారులో ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా సాగుచేస్తున్న పెసర, మినుము పంటలను బుధవారం ఏఈవోలు ప్రశాంత్‌కుమార్, రవికుమార్ పరిశీలించారు. పెసర, మినుము పంటలకు ప్రస్తుతం పచ్చదోమ ఆశించిందని వారు చెప్పారు. పచ్చదోమ నివారణ కోసం రైతులు తగుచర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం 330 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రైడ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి సాయంత్రం వేళలో ఎకరం పంటపై పిచికారీ చేయాలని వారు చెప్పారు. దీంతోపాటు పంటచేనులో అక్కడక్కడా నూనె పూసిన పసుపురంగు కాగితాలను లేదా ఎల్లోట్రాప్స్‌ను ఎకరాకు 8 వరకు ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. దీనివల్ల దోమ పసుపురంగుకు ఆకర్షితమై కాగితాలకు అతుక్కుంటాయన్నారు. ఆత్మ బీటీఎం షఫీ, రైతులున్నారు.

నాగన్నగారి బావి..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి బావిని బుధవారం డీఆర్‌డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి సురేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశీలించి పూల మొక్కలు, క్రోటాన్ తదితర మొక్కలు పెంచి పరిసరాలను ఆహ్లాదకరంగా తయారు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలి

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు తప్పనిసరిగా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి అవగాహన కలిగి, సమాజం పట్ల బాధ్యతతో ఉండాలని స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలపై విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, అకడమిక్, యూజీసీ సమన్వయకర్తలు పి.విశ్వప్రసాద్, గణేష్, ఎన్‌సీసీ అధికారి ఏ.సుధాకర్, అధ్యాపకులు జి.శ్రీనివాస్‌రావు, రాజ్‌గంభీర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్, ముంబోజిపేట, జల్దిపల్లి, రాంపూర్, మెంగారం, బోనాల్, లింగంపేట గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. నేతలు ఎల్లమయ్య, అశోక్, నాగరాజు, రాజు, నగేష్, పూల్‌సింగ్, గోపాల్ పాల్గొన్నారు.

బెల్టు షాపుల జోరు

- పిట్లం మండల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు
- అనంతరం ఖాళీ సీసాలను పగలగొడుతున్న వైనం
- పగిలిన గాజు పెంకులతో ఇబ్బందులకు గురవుతున్న రైతులు, మూగజీవాలు
- మద్యం మత్తులో ప్రజానీకం



పిట్లంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అనంతరం పడేసిన మందు బాటిళ్లు

పిట్లం(జుక్కల్): మండలంలో మందుబాబులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ ప్రదేశాలలో, పొలాల వద్ద మద్యం సేవించి సీసాలను అక్కడే పగలగొడుతున్నారు. పగిలిన సీసాలతో రైతులు, మూగజీవాలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ వెలసిన బెల్టుషాపులలో చీప్‌లిక్కర్ మొదలుకుని అవసరమైన అన్ని బ్రాండ్ల మద్యం లభ్యమవుతోంది. దీంతో ఇంతకు ముందు వరకు కల్లు సేవించే బడుగు జీవులు సైతం ఇప్పుడు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంటున్న నాసిరకం మద్యాన్ని సేవించి నిషా మత్తులో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. బెల్టుషాపుల నిర్వహణ లాభసాటిగా ఉండటంతో అనేక మంది వీటిని ఏర్పాటు చేసేందుకు పోటీపడుతున్నారు. బెల్టుషాపులు ఎక్కువ మొత్తంలో ఉండడంతో మద్యం ప్రియులకు ఉద్దెర కూడ ఇస్తున్నారు. దీంతో పల్లె జనం సమయం సందర్భం లేకుండా మద్యం తాగుతూ మత్తులో తూగుతున్నారు. గ్రామాలలో మద్యం అమ్మకాల జోరు కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు రేగుతోంది. కొంతమంది మద్యం బానిసలు ఎటూ తోచని స్థితిలో నేరాలకు సైతం పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని నిబంధనలు విధించినా దానిని అమలు చేసే వారే కరువయ్యారు. ఎమ్మార్పీ ధరల కంటే సుమారు 20 శాతం అదనంగా బెల్టుషాపుల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అధికారులు గ్రామాలలో బెల్టుషాపుల నిర్వహణ వైపు చూసీచూడనట్టుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. పల్లె ప్రజల జీవితాలను కకావికలం చేస్తున్న బెల్టుషాపులను ప్రభుత్వం వెంటనే మూసి వేయించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు, ప్రత్యేకించి మహిళలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులతో బాధ్యతగా ప్రవర్తించాలి



పాఠశాలలో జరిగే ప్రార్థనకు హాజరైన సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: విద్యార్థులతో ఉపాధ్యాయులు బాధ్యతగా ప్రవర్తించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ప్రార్థనకు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి రోజు శుభ్రంగా ఉండే కూరగాయలతో వంట చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రిన్సిపల్ ధనలక్ష్మి తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించడంలో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు



బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంస్థ బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బన హరీష్ విమర్శించారు. ప్రభుత్వ విద్యార్థి వసతిగృహాల్లో సమస్యలను గుర్తించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, నాయకులు ఇమ్రాన్, అరవింద్ గౌడ్, బర్కత్, నాగం సురేందర్, మనోజ్, దీపక్, భాను, పరశురాం పాల్గొన్నారు

గురుకుల పాఠశాల వద్ద ఆందోళన

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం కొయ్యగుట్టలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వద్దకు చేరుకున్న నాయకులను లోపలికి అనుమంతించకపోవడంతో ఆందోళన చేపట్టారు. గురుకుల సొసైటీ ఉన్నతాధికారుల ఆదేశానుసారం పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీబాయి నాయకులను లోనికి అనుమతించలేదు. దీంతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు పాఠశాల గేటు ముందు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెల్సిన బాన్సువాడ సీఐ అశోక్, ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. వారు నిరాకరించడంతో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ఉద్యోగాలు

బాన్సువాడ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అత్యధికంగా ఉద్యోగాలు వచ్చాయని బీఆర్‌ఎస్ నాయకులు రాజారాంయాదవ్ అన్నారు. బుధవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు సాధించిన వారికి నియమాక పత్రాలు ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెబుకుంటున్నారని విమర్శించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థి చనిపోతే ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజాపాలన సంబరాలు జరుపుకోవడం శోచనీయమని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు మోచీ గణేష్, సాయిబాబా ఉన్నారు.

గోదాముకు స్థలం కేటాయించాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్

బాన్సువాడ : కామారెడ్డి జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా ఐడీసీఎంఎస్ గోదాములకు స్థలం కేటాయించాలని ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతి పత్రం అందజేశారు. బాన్సువాడలో ఐడీసీఎంఎస్‌కు చెందిన 3 ఎకరాల 16 గుంటల గోదాముల స్థలంలో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి నిర్మించారని గుర్తు చేశారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా ఐడీసీఎంఎస్‌కు 10 ఎకరాల స్థలం కేటాయిస్తే గోదాములను, సీడ్ ప్లాంట్‌లు, మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి స్థలం కేటాయించాలని విన్నవించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో పూర్ణచంద్రరావ్

రాజంపేట : మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి పూర్ణచంద్రావు అన్నారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులుతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆహారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా భోజనాన్ని రుచి చూసిన అనంతరమే విద్యార్థులకు వడ్డించే విధంగా చూడాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే భోజన ఏజెన్సీలపై చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు.

దివ్యాంగులు అధైర్య పడొద్దు



గాంధారి(ఎల్లారెడ్డి): దివ్యాంగ చిన్నారులు అధైర్య పడొద్దని ఎంఈవో శ్రీహరి సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ఫిజియోథెరపి చికిత్సలు చేయించాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వేంకటేశ్వర్ గౌడ్, వైద్యులు సారిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించడానికే న్యాస్ పరీక్ష



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించడానికే ప్రభుత్వం న్యాస్ పరీక్షలు నిర్వహిస్తోందని మండల విద్యాధికారి షౌకత్ అలీ అన్నారు. బుధవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని న్యాస్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి, మైనార్టీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే జిల్లా సెక్టోరియల్ అధికారులు సైతం మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న కేంద్రాన్ని సందర్శించారు.

పింఛన్లు ఇప్పించండి సారూ..!



ఎంపీడీవోతో మాట్లాడుతున్న మహిళలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అర్హులైన తమకు పింఛన్లను ఇప్పించండి సారూ అంటూ తాండూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు బుధవారం ఎంపీడీవో ప్రభాకరచారిని వేడుకున్నారు. 57 ఏళ్లు పైబడిన తమకు పింఛన్లను ఇప్పించాలని కొందరు, భర్త చనిపోయి వితంతువుగా మారిన తమకు పింఛన్లను మంజూరు చేయించాలని మరికొందరు ఎంపీడీవోను కోరారు. ప్రస్తుతం పింఛన్ దరఖాస్తుల ఎంట్రీకి సంబంధించి ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదని, ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ అయిన వెంటనే పింఛన్ దరఖాస్తులను ఎంట్రీ చేస్తామని ఎంపీడీవో వారికి నచ్చజెప్పి పంపించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర



కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర చేస్తోందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో కల్తీ ఆహారం సాధారణమైపోయిందని, వివిధ కారణాలతో 40 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వంలో స్పందన కరువైందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ప్రతినిధులు దయాకర్, ప్రవీణ్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణపై అవగాహన





ఎల్లారెడ్డిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖాధికారులు ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలో వన సంరక్షణ, వన్యప్రాణి సంరక్షణ విషయమై అటవీ శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి రేంజ్ అధికారి ఓంకార్ మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వన దర్శి కార్యక్రమం పేరిట విద్యార్థులకు వన సంరక్షణ, వన్యప్రాణి సంరక్షణ, అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్, వెల్లుట్ల, మెంగారం అటవీ ప్రాంతాలకు పాఠశాల విద్యార్థులను తీసుకువెళ్లి వనాలను వన్య ప్రాణులను రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో వన్యప్రాణి సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శ్రీను నాయక్, పృథ్వీరాజ్, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు

ధర్మారెడ్డి బీట్ అటవీ ప్రాంతంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ధర్మారెడ్డి బీట్ అటవీ ప్రాంతంలో స్థానిక ఫారెస్ట్ అధికారులు బుధవారం 'వనదర్శిని' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ వారితో ట్రెక్కింగ్ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి నాగిరెడ్డిపేట ఫారెస్ట్‌రేంజ్ అధికారి వాసుదేవ్, కళాశాల విద్యార్థులకు వివరించారు. ఫారెస్ట్ బీట్ అధికారులు నవీన్, సమ్రీన్, డాటాఎంట్రీ ఆపరేటర్ బాలు, కళాశాల అధ్యాపకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

రామారెడ్డి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 4, 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



మాచారెడ్డి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు తలారి ప్రభాకర్ కోరారు. బుధవారం పాల్వంచ మండలంలోని భవానీపేట, భారత సింగరాయపల్లి, పోతారం గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కన్వీనర్ ఐండ్ల ప్రభాకర్, భవానీపేట్ తాజా మాజీ సర్పంచ్ మద్దెల రాజు, డీలర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గం

భిక్కనూరు: మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రోళ్ల రాజు, అధికార ప్రతినిధిగా చల్మెడ కుమార్, ఉపాధ్యక్షులుగా దోమకొండ ప్రశాంత్, సీహెచ్ పరశురాం, ప్రధానకార్యదర్శిగా ఆర్.నాగరాజు, సహాయ కార్యదర్శిగా ఎస్.రాకేష్, ప్రచార కార్యదర్శులుగా జి.సురేష్, చిన్నస్వామి, కార్యవర్గ సభ్యులుగా డి.సురేందర్, గోసు రాము, ఉప్పల రాజు, చెట్లపల్లి వేణు, సూరారం దినేష్, తమ్మగల్ల బాలేష్‌లు ఎన్నికయ్యారు. వీరికి ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకులు సామ్యేల్ మాదిగ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సంక్షిప్తం

అటవీ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రజాపాలన దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌ఆర్వో హేమ చందన అన్నారు. విద్యార్థులను స్థానికంగా ఉన్న అడవిలోకి తీసుకెళ్లి పలు విషయాలు వివరించినట్లు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ మల్లన్నగుట్టలో నూతనంగా నిర్మించిన విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధ వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్ల మహేశ్‌చారి, ము త్యంచారి, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీలో తప్పులు ఉండకూడదు

ఎల్లారెడ్డి: కుటుంబ సర్వే వివరాలను పొరపాట్లు లేకుండా ఎంట్రీ చేయాలని ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న డాటా ఎంట్రీ పనులను ఆయన పర్యవేక్షించారు. డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు

శివప్ప మృతి బీజేపీకి తీరనిలోటు

బాన్సువాడ: బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ శివప్ప మృతి బీజేపీకి తీరని లోటని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన డాక్టర్ శివప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేసిన శివప్ప పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. నాయకులు శంకర్ గౌడ్, గుడుగుట్ల శ్రీనివాస్, పాశం భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, కోనాల గంగారెడ్డి, వెంకట్ ఉన్నారు.

హ్యాట్రిక్ అధ్యక్షుడిగా దేవయ్య

మాచారెడ్డి: మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ హ్యాట్రిక్ అధ్యక్షుడిగా లింగంపల్లి దేవయ్యను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా దశరథం, కోశాధికారులుగా సిద్ధిరాములు, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడిగా తుమ్మ శంకర్, సలహాదారులుగా పరమేశ్వర్, శేఖర్, విశ్వనాథం, ఎస్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.అనంతరం సన్మానించారు.

బీడీ కేంద్రాన్ని తరలించొద్దు

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఎమ్మెస్ లంగర్ బీడీ కేంద్రాన్ని తరలించవద్దని బుధవారం ఆ బీడీ కేంద్రం ముందు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం(బీఎల్టీ యూ) ఆధ్వర్యంలో ఆయా గ్రామాల బీడీ కార్మికులు ఆందోళన చేశారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం బీడీ కేంద్రం తరలింపు నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించడంతో కార్మికులు ఆందోళనను విరమించారు. నేతలు సిద్దిరాములు, ఎల్లయ్య, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పోలింగ్ బూత్‌లలో మౌలిక సౌకర్యాలు ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం కాటేపల్లి, కాంటేపల్లి తండాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా వెంకటేష్

భిక్కనూరు: మండల యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా శ్రీరామ్ వెంకటేష్ ఎన్నికయ్యారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్ బుధవారం నియమాక పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ఇలియాస్‌కు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో లింగంపేట నేతల హవా



సాజిద్



కయ్యూమ్

లింగంపేట(ఎల్లారెడ్డి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో లింగంపేట నేత హవా కొనసాగింది. రెండు నెలల క్రితం ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గం ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేశారు. ఓటింగ్‌లో జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న యువతీ, యువకులు ఓటు హక్కును ఆన్‌లైన్ ద్వారా వినియోగించుకున్నారు. నెల రోజులుగా ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించారు. బుధవారం ఎన్నికల ఫలితాలు ఐవైసీ (ఇండియన్ యూత్ కాంగ్రెస్) విడుదల చేసింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ సాజిద్ 1660 ఓట్లతో గెలుపొందారు. కామారెడ్డి జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ కాశీఫ్ 286 ఓట్లతో గెలుపొందారు. అలాగే లింగంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 306 ఓట్లతో అబ్దుల్ కయ్యూమ్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారా ఎన్నికైన ఇద్దరిలో ఒకరు జిల్లా స్థాయిలో, మరొకరు మండల స్థాయిలో గెలుపొందడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హామీల అమలులో సీఎం విఫలం



దోమకొండ: సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలులో విఫలమయ్యారని బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క పింఛన్, రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు దోమకొండ మండల కార్యాలయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై చార్జిషీట్ విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో దోమకొండ మండల బీజేపీ అధ్యక్షుడు మద్దూరు భూపాల్ రెడ్డి , కామరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, నేతలు సాహెబ్‌గారి నర్సింలు, అనుపటి నరేందర్ రెడ్డి, కంది మనోజ్ కుమార్, శ్రీనాథ్, సచిన్ పాల్గొన్నారు.